# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## నక్సల్ బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

మంచిర్యాల పట్టణం: నక్సల్ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నక్సల్స్ బాధిత వ్యక్తి రాఠోడ్ జయ్‌చంద్ చేపట్టిన సైకిల్‌యాత్ర మంచిర్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత 30 ఏళ్లలో అనేక మందిని నక్సలైట్లు హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు బాధిత కుటుంబాల్లో పెద్ద దిక్కు కోల్పోయి అనేక మంది ఆర్థిక ఇబ్బందులతో వీధినపడ్డారని తెలిపారు. బాధిత కుటుంబాలను అప్పుడు అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పిన అధికారులు తర్వాత విస్మరించారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నక్సల్ బాధిత కుటుంబాలలో ఇంటికి ఒక ఉద్యోగం ఇచ్చి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కుమురంభీం జిల్లా అసిఫాబాద్ నుంచి హైదరాబాద్ వరకు సైకిల్‌యాత్ర చేపట్టినట్టు ఆయన తెలిపారు. మంచిర్యాలకు చేరిన రాఠోడ్ జయ్‌చంద్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నక్సల్ బాధిత కుటుంబాల సభ్యులు తిప్పని హరిప్రసాద్, బానోత్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్య శిక్షణలు ఆర్థికాభివృద్ధికి దోహదం



ఉట్నూరు : వివిధ రకాల నైపుణ్యతతో కూడిన శిక్షణ ఉపాధి కల్పించడంతోపాటు ఆర్థికాభివృద్ధి కి దోహదపడతాయని నాబార్డు డీడీఎం నిశికాంత్ పురోహిత్ అన్నారు. ఉట్నూరులోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెట్టి) ఆధ్వర్యంలో మహిళలు, యువతుల కోసం ఏర్పాటుచేసిన కుట్టు, అల్లికల శిక్షణను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు ఎస్‌బీఐ ఎల్డీయం జీవీఎస్‌కే ప్రసాద్, ఆర్బీఐ మేనేజర్ అనిల్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో పేదరికం కారణంగా కొంతమంది మహిళలు, యువతులకు ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక వారు ఆర్థిక ఇబ్బందులతో అనేక సమస్యలను ఎదుర్కోంటున్నారన్నారు. అటువంటి వారికి కుట్టు, అల్లికలు వంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. శిక్షణను చక్కగా నేర్చుకొని తమతమ గ్రామాలలో దుస్తులను కుడుతూ ఉపాధి పొందవచ్చునన్నారు. శిక్షణ నేర్చుకున్నవారికి సంస్థ ప్రశంసాపత్రాలను అందజేస్తుందన్నారు. శిక్షణ పొందిన తరువాత బ్యాంకులు సైతం ఆర్థిక సహాయాన్ని అందిజేస్తాయన్నారు. ఎల్డీఎం, ఆర్బీఐ మేనేజర్ మాట్లాడుతూ.. మహిళలు, యువతులు శిక్షణపై పూర్తి ఏకాగ్రతను పెట్టి నేర్చుకోవాలన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే మిగతా వారందరూ అభివృద్ధి దిశలో పయనిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సెట్టి డైరెక్టర్ మంగీలాల్, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ : ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ పథకం కింద అభ్యర్థుల నుంచి ఉచిత సంగణక శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శిక్షణ కేంద్రం నిర్వహకులు కె.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో భాగంగా శిక్షణ పొందే అభ్యర్థులకు నగదు రహిత లావాదేవీలతో పాటు సంగణకంపై పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. అంతర్జాలం, డిజిటల్ లాకర్ ఆవశ్యకత, వ్యక్తిగత అభివృద్ధి, భావవ్యక్తికరణ నైపుణ్యం, ఆన్‌లైన్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే విధానంపై శిక్షణలో వివరిస్తామన్నారు. ఆసక్తి గల 14 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వారు మావల పంచాయతీలోని రాంనగర్‌లో గల కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. మిగతా సమాచారం కోసం చరవాణి నంబరు 9059899500ను సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

బోథ్ : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని సేవాలాల్ విద్యార్థిసేన జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతులు సోయా, పత్తి పంటల్లో తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వెంటనే రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్తికి మద్దతు ధర రూ.7,000, సోయాకు రూ.4,000 చెల్లించాలన్నారు. రైతులకు న్యాయం జరిగేవరకు సేవాలాల్ విద్యార్థి సేనా ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు సిహెచ్.ఖండు, జాదవ్ శశికుమార్, డి.కిరణ్‌కుమార్, రాఠోడ్ శ్రీరామ్, అనిల్‌కుమార్‌లు ఉన్నారు.

## శాంతి పరిరక్షణలో యూఎన్‌వో పాత్ర కీలకం

సిద్దిపేట : ప్రపంచ శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్య సమితి (యూఎన్‌వో) కీలకపాత్ర పోషిస్తోందని విశ్రాంత ఉపన్యాసకుడు, వక్త పి.వీరేశం అన్నారు. ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భవానితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రపంచ శాంతి లక్ష్యంగా యూఎన్‌వో కృషి చేస్తోందన్నారు. జనాభా నియంత్రణ, మొక్కల పెంపకం, వాతావరణ కాలుష్య నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. దేశాల మధ్య ఆర్థిక తగాదాలతో కలిగే ఆర్థిక, రాజకీయ, సామాజిక నష్టాలను వివరించారు. కార్యక్రమ అధికారిణి సువర్ణాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా నాగోబా దర్శనానికి వస్తా..



ఇంద్రవెల్లి : ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా దర్శనానికి కుటుంబ సమేతంగా త్వరలో వస్తానని ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగరపాలక సంఘం కమిషనర్ జనార్దన్ నివాస్ అన్నారు. కేస్లాపూర్ నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ పీఓ గా ఇక్కడ పని చేసిన కాలంలో ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై పెట్టిన కేసులో కోర్టుకు వచ్చానన్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా దర్శనం చేసుకున్నారు. అనంతరం అక్కడ మాట్లాడుతూ.. త్వరలో కుటుంబసమేతంగా నాగోబా దేవతను దర్శించుకుని, ఇక్కడి నుంచి బాసరలోని సరస్వతి దేవి ఆలయానికి వెళ్తామని అన్నారు. అనంతరం ఐకేపీ ఏపీడీ రామకృష్ణతో మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులు ఏలా ఉన్నాయి. ఆదివాసీ లకు ప్రభుత్వ పథకాలను అందించాలని సూచనలు చేశారు. ఆయన వెంట శిక్షణ ఉప పాలనాధికారి డాక్టర్ గోపి, సర్పంచి మెస్రం నాగ్‌నాథ్, ఐకేపీ ఏపీడీ రామకృష్ణ, ఏపీఎం రాజన్న, సీసీ అన్వాతే సూర్యకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## 26న మెదక్‌లో జాబ్ మేళా

మెదక్: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన (డీడీయూజీకేవై), ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ (ఈజీఎంఎం) ద్వారా నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ఈనెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సీతారామరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ శివారు గాంధీనగర్‌లోని పాత సరస్వతి శిశుమందిర్ పాఠశాల భవనంలో ఉదయం 11 గంటలకు స్క్రీనింగ్ క్యాంపు ప్రారంభం అవుతుందని వివరించారు. 19 నుంచి 26 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులని స్పష్టంచేశారు. శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. తర్ఫీదు పూర్తయ్యాక హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఉద్యోగావకాశం కల్పిస్తామని వివరించారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు నిర్ణీత తేదీల్లో విద్యార్హతల ధ్రువీకరణ పత్రాల నకళ్లు, బయోడేటాతో హాజరుకావాలన్నారు.

## సోయా కొనుగోళ్లలో పరిమితి

ఆదిలాబాద్ : ప్రభుత్వ మద్దతు ధరతో రైతుల నుంచి సోయా కొనుగోలు చేసేందుకు హకా పకడ్బందీ చర్యలు చేపట్టింది. సోయా కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాలకు సంబంధించిన అధికారులకు ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో ఉన్న ట్యాబ్‌లను అందించారు. రైతుల అమ్మకాలపై పరిమితి విధించారు. అక్రమ అమ్మకాలను అడ్డుకునేందుకు కొత్త విధానం అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ విపణిలో బుధవారం నుంచి సోయాను కొనుగోలు చేస్తున్నట్లు కార్యదర్శి అడెల్లు తెలిపారు.

జిల్లాలో జైనథ్ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభించగా, ఆదిలాబాద్‌లో బుధవారం నుంచి కొనుగోలు చేయనున్నారు. అయితే సోయా అమ్మకాలకు పరిమితి విధించారు. ఒక్కో రైతు 75 క్వింటాళ్లకు మించి అమ్ముకోవడానికి వీలులేదు. ఇందులో ఒక రోజు ఆ రైతు తన పేరున 25 క్వింటాళ్లకు మించి అమ్ముకోవడానికి అవకాశం లేదు. రైతుల పేరున దళారులు వందల క్వింటాళ్ల సోయాను అమ్మే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సాఫ్ట్‌వేర్‌ను కూడా అదే విధంగా రూపొందించారు. రైతు 25కు మించి సోయాను మార్కెట్‌కు తీసుకువస్తే, వాటిని తన కుటుంబసభ్యుల పేరిట అమ్ముకోవడం, లేదా మరుసటి రోజును అమ్ముకోవడానికి అవకాశం ఉంది. ఒక రైతు పేరున 25 క్వింటాళ్లు మాత్రమే ట్యాబ్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా మూడు సార్లు 25 క్వింటాళ్ల చొప్పున 75 క్వింటాళ్ల వరకు అమ్ముకోవచ్చు. తరువాత ఆ రైతు పేరున మళ్లీ సోయా అమ్మడానికి తీసుకువస్తే ట్యాబ్‌లో నమోదు కాదు..

## రైతుకు మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

ఖమ్మం : రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి అన్నారు. సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన రైతు దీక్షలను రెండో రోజు ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఆరుగాలం కష్టించి పనిచేసి, పెట్టుబడి పెట్టి పంటచేతికొచ్చిన తరువాత పంటను మార్కెట్‌కు తీసుకవస్తే తేమ పేరుతో వ్యాపారులు, దళారులు రైతును నిలువుదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కనీస మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ఆర్భాటంగా సీసీఐ కేంద్రాలను ప్రారంభించినా నేటి వరకు ఒక్క క్వింటా పత్తిని కూడా కొనుగోలు చేయలేదన్నారు. పత్తికి రూ.8వేల మద్దతు ధర కల్పించి సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతు సరకును మార్కెట్‌లో అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్న చందంగా ఉందన్నారు. వ్యాపారులు, కమీషన్ ఏజంట్లు కుమ్మక్కై రైతులను బహిరంగంగా దోచుకుంటున్నా అధికారులు చూస్తూ పూరుకుంటున్నారే తప్ప నివారించడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు మలీదు నాగేశ్వరరావు, గుర్రం అచ్చయ్య, అర్జున్‌రావు, లాల్‌మియా, శివలింగం, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## మద్దతు ధర కల్పనకు కొనుగోలు కేంద్రాలు

భువనగిరి : పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ అనితా రామచంద్రన్ అన్నారు. వారు పట్టణశివారు లోని జిన్నింగ్ మిల్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యతా ప్రమాణాల మేరకు పత్తిని తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని అన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని అన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, సంయుక్త కలెక్టర్ రవినాయక్, పుర అధ్యక్షురాలు సుర్వి లావణ్య, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అమరేందర్‌గౌడ్, మార్కెట్ ఛైర్మన్ పంతులు నాయక్, వైస్ ఛైర్మన్ నోముల పరమేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారిక, సీసీఐ కొనుగోలు అధికారి అవినాష్, నాయకులు చందుపట్ల రాజేశ్వర్‌రావు, జనగాం పాండు, చందుపట్ల వెంకటేశ్వర్‌రావు, ఆకుల జయమ్మ, మార్కెట్ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## దిగుబడి అంచనాలకు పంటకోత ప్రయోగాలు

### అర్థఖగణాంక శాఖ రాష్ట్ర సంచాలకులు సుదర్శన్‌రెడ్డి




కౌడిపల్లి: అన్ని పంటలకు సంబంధించి పంట దిగుబడులను అంచనా వేయడం కోసమే పంటకోత ప్రయోగాలను నిర్వహిస్తున్నామని అర్థఖగణాంక శాఖ రాష్ట్ర సంచాలకులు (డైరెక్టర్) సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. కౌడిపల్లి గ్రామ శివారులోని రైతు నాండ్ల భిక్షపతి వరి పొలంలో జరిగిన పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త సంచాలకులు దయానందంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏటా ఖరీఫ్, రబీ కాలాలకు అన్ని పంటలకు సంబంధించి పంట కోత ప్రయోగాలను చేపడతామన్నారు. ఎకరాకు సరాసరి దిగుబడిని అంచనా వేసేందుకే ప్రయోగాలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి వంద హెక్టార్లకు ఒక యూనిట్‌గా పరిగణించి నాలుగు ప్రయోగాలు చేస్తామని, పంటలకు సంబంధించి సాధారణ దిగుబడి ఎంత ఉందనే విషయం సైతం తెలుస్తుందని స్పష్టంచేశారు.

మండలం యూనిట్‌గా పంటల దిగుబడుల అంచనా, గ్రామం యూనిట్‌గా బీమా గురించి తెలుసుకుంటామని చెప్పారు. దిగుబడులకు ముందు రెండుసార్లు ప్రయోగాన్ని పరిశీలిస్తామని వివరించారు. జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి నాగేశ్వర్‌రావు, డీఎస్‌వో పద్మజ, కౌడిపల్లి వ్యవసాయశాఖ సహాయసం చాలకురాలు ఆదిలక్ష్మి, మండల ఏఎస్‌వో నవీన్, ఏఈవోలు ప్రేమ్‌రాజ్, రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

### డిసెంబరు 15 లోపు భూదస్త్రాల ప్రక్షాళన పూర్తి చేయాలి



తూప్రాన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూదస్త్రాల పరిశీలనను వేగిరం చేయాలని జిల్లా పాలనాధికారి భారతి హొళికెరి అధికారులకు సూచించారు. తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలో ఉన్న తహసీల్దార్లు, ఉపతహసీల్దార్లతో భూదస్త్రాల పరిశీలన కార్యక్రమం తీరుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 381 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటివరకు 108 గ్రామాల్లో భూపరిశీలన పూర్తిచేశామని చెప్పారు. సమస్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో సిబ్బంది ఇబ్బందులు పడకుండా ఉన్నతాధికారుల సలహాలు, సూచనలతో ముందుకు వెళ్లాలని స్పష్టంచేశారు. డిసెంబరు 15లోపు అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు పూర్తి కావాలన్నారు. అధికారులు సిబ్బంది నిర్ణీత సమయం కంటే అధిక సమయం కేటాయిస్తూ పనులు చేపట్టాలని, వివరాలను ఎప్పటికప్పుడు అంతర్జాలంలో నిక్షిప్తం చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తూప్రాన్ ఆర్డీవో మధు, తహసీల్దార్లు నజీబ్‌అహ్మద్, రాజేశ్వర్‌రావు, విజయలక్ష్మి, కృష్ణవేణి, ఉపతహసీల్దారు శ్రీనివాస్, అర్చన తదితరులున్నారు.

భూరికార్డుల ప్రక్షాళన వేగిరం జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు. ఆయన ఆయా జిల్లాల పాలనాధికారులతో దృశ్యసమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి పాలనాధికారి భారతి హొళికెరి, ఇన్‌ఛార్జి డీఆర్వో రాములు, పర్యవేక్షకురాలు శ్రీదేవి పాల్గొన్నారు. డిసెంబరు 31 వరకు కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రక్షాళనపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలోని అన్ని సర్వే నెంబర్లు, విస్తీర్ణంపై సమగ్ర సమాచారం సంబంధికుల వద్ద ఉండేలా చూసుకోవాలని స్పస్టంచేశారు. ఇప్పటివరకు దస్త్రాల ప్రక్షాళన పూర్తయిన గ్రామాల వివరాలను పంపించాలని ఆదేశించారు. జిల్లాలో 25 శాతం రికార్డుల ప్రక్షాళన పూర్తయ్యిందని, నిర్ణీత సమయంలో కార్యక్రమాన్ని పూర్తిచేసేందుకు చర్యలను వేగిరం చేస్తామని పాలాధికారి భారతి హొళికెరి వివరించారు.

## బాలికలు తగ్గడం ఆందోళనకరం : కలెక్టర్



మహబూబ్‌నగర్ : జిల్లాలో బాలుర కంటే బాలికల సంఖ్య తగ్గడం ఆందోళన కలిగిస్తున్న విషయమని కలెక్టర్ రొనాల్డ్‌రోస్ అన్నారు. గైనకాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు మగ, ఆడ బిడ్డ ఇద్దరూ సమానమే అన్న విషయం తెలుసుకోవాలని కోరారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో కూడా పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని అన్నారు. ఇంటికి ఆడబిడ్డ భారం కాదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు సైతం ఈ విషయాన్ని స్త్రీ వైద్య నిపుణులు తెలియజేయాలని సూచించారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఆడ పిల్లలు ఉన్న ఇంట్లో సంతోషాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు.

వైద్యులు సైతం విస్తృతంగా దీనిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. బాలికలు, మహిళల రక్షణ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, దీని కోసం ప్రత్యేకంగా షి బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అంతకంటేముందు విద్యార్థులు బాలికల ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ ప్లకార్డులతో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.రజిని, స్త్రీ, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి గోవిందరాజులు, స్త్రీ వైద్య నిపుణులు డా.ప్రతిభ, డా.పద్మ, డా.చంద్రముఖి, డా.జయంతిరెడ్డి, డా.సుహాసిని, డా.కవితరెడ్డి, డా.సునితరెడ్డి, డా.రేణుక, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటయ్య, ఎన్టీఆర్ కళాశాల సీనియర్ అధ్యాపకులు హుమేరసయిద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల విక్రయాల్లో పారదర్శకత



భువనగిరి : ఎరువుల విక్రయాల్లో పారదర్శకత పాటించేందుకు ఈపాస్ యంత్రాలను ప్రవేశ పెట్టినట్లు జిల్లా వ్యవసాయ అధికారి హరినాథ్ బాబు చెప్పారు. స్థానిక వర్తక సంఘ భవనంలో ఎరువుల తయారీ కంపెనీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో రైతులకు దక్కాల్సిన ఎరువులు పలు సందర్భాల్లో పక్కదారి పట్టేవని అన్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదన్నారు. ప్రస్తుతం అన్ని విక్రయాలు పారదర్శకంగా యంత్రాల ద్వారానే చేపడ్తా మన్నారు. ఎరువుల దుకాణదారులు క్రయ విక్రయాలను యంత్రంలో నిక్షిప్తం చేయాల్సి ఉంటుందన్నారు. ఎమ్మార్పీకి రైతులకు ఎరువులను విక్రయించాల్సి ఉంటుందన్నారు. ఎరువులు కొనుగోలు చేసే రైతు ఆధార్‌కార్డు, వేలి ముద్రలను నమోదు చేయాల్సి ఉంటుం దన్నారు. నిజమైన రైతులకు ఎరువులు అందిన పక్షంలోనే కంపెనీ వారికి ప్రభుత్వ రాయితీ జమవుతుందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు తావుండదని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన ఎరువుల డీలర్లకు ఈపాస్ యంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున ఫర్టిలైజర్ జీఎం రవిప్రకాష్‌రెడ్డి, ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, నర్సింహారావు, కరీముల్లా, అవినాష్, కోరమండ ల్, దీపక్ ఫర్టిలైజర్స్ ప్రతినిధులు, జిల్లా పరిధిలోని 110 మంది ఎరువుల వ్యాపారులు పాల్గొన్నారు.

# గొర్రెలు అమ్మితే చర్యలు తప్పవు

తాంసి : జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలం వడ్డాడిలో రాయితీ గొర్రెల లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు రామారావు రాఠోడ్ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందించిన గొర్రెలను కుర్మ, గొల్ల కులస్థులు సద్వినియోగించుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పెంపకం చేయకుండా దళారులకు అమ్మితే బాధితులపై కేసు నమోదు చేస్తామన్నారు. చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనారోగ్యంతో చనిపోయిన గొర్రెల స్థానంలో మరో గొర్రెను త్వరలోనే అందిస్తామన్నారు. మందుల సరఫరాతో పాటు గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గజానన్, సర్పంచి శ్రీనివాస్, గొర్రెల సంఘం అధ్యక్షుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీయూ ఎంబీఏ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ, ఎంబీఏ టీటీఎం నాలుగో సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ, 4, 8, 10వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయంలో వీసీ అల్తాఫ్ హుస్సేన్, పరీక్షల నియంత్రణ అధికారి ఆకుల రవి విడుదల చేశారు. ఎంబీఏ, ఎంబీఏ టీటీఎం నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో 480 మంది విద్యార్థులకుగాను 297 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంబీఏ ఇంటిగ్రేటెడ్ నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో 33 మందికిగాను 21 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంబీఏ ఎనిమిదో సెమిస్టర్ పరీక్షల్లో 17 మంది విద్యార్థులకు గాను 16 మంది ఉత్తీర్ణత సాధించారు. పదో సెమిస్టర్‌లో 8 మందికి 7 మంది ఉత్తీర్ణత సాధించగా ఒక్కరు విత్‌హెల్డ్‌గా మిగిలారు. ఎంజీయూ సహాయ పరీక్షల నియంత్రణ అధికారి శివరామ్, తదితరులు పాల్గొన్నారు.

# మేస్త్రీ నిజాయతీ రూ.1.67 లక్షలు పోలీసులకు అప్పగింత



అమరచింత : అమరచింత మండల కేంద్రం బీసీ కాలనీకి చెందిన మేస్త్రీ రఘుకు ఏటీఎం వద్ద దొరికిన రూ.1.67 లక్షల నగదును పోలీసులకు అందించారు. దీంతో ఎస్ఐ సత్యనారాయణరెడ్డి మేస్త్రీని అభినందించారు. అమరచింత ఆంధ్రాబ్యాంకు ఏటీఎం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మరిచిపోయిన ప్లాస్టిక్ కవరు మేస్త్రీ రఘుకు కనిపించింది. అరగంట అయినా ఆ కవరు ఎవరూ తీసుకుపోలేదు. దీంతో రఘు ప్లాస్టిక్ కవరు తీసుకొని పరిశీలించగా అందులో నగదు కనిపించింది. వెంటనే ఎస్ఐకు ఫోన్ చేసి ఠాణాలో అప్పగించారు. అందులో నగదు రూ.1.67 లక్షలు ఉన్నాయి. నర్వ మండల కేంద్రానికి చెందిన లక్ష్మయ్య బ్యాంకులో పంట రుణాలు చెల్లించడానికి వచ్చారు. ఏటీఎం వద్ద మెట్లపైన కూర్చొని ఉన్న లక్ష్మయ్యకు తెలిసిన వారు నగదు కట్టడానికి ఓచర్ రాయమని కోరగా, ప్లాస్టిక్ కవరు పక్కన పెట్టి రాసి ఇచ్చారు. ఆ తర్వాత మాటల్లో కవరు అక్కడే వదలి వెళ్లారు. బ్యాంకులో వరుసలో నిలబడి పంట రుణం చెల్లించడానికి క్యాషియర్ వద్దకు వెళ్లాడు. జేబులో కవరు చూడగా లేదు. దీంతో కంగారుతో విషయం బ్యాంకు అధికారులకు చెప్పి ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అంతక మునుపే స్టేషన్‌లో అందించిన నగదును లక్ష్మ య్యదిగా గుర్తించి నగదు కవరును మేస్త్రీ రఘు, సర్పంచి పురం వెంకటేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా రైతుకు అందజేశారు.

# ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ప్రదర్శన

ఖమ్మం : రాష్ట్రంలో చౌకదుకాణాలు రద్దు చేసి వాటి స్థానంలో నగదు బదిలీని ప్రవేశపెట్టాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన బస్టాండ్ సెంటర్ మీదుగా పెవిలియన్ మైదానం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వరకు సాగింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు మేరుగు రమణ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం సరియైనది కాదన్నారు. బహిరంగ మార్కెట్‌లో పెరిగిన ధరల దృష్ట్యా నిత్యవసర సరకులను కొనలేని స్థితిలో ప్రజలు ఉంటే ప్రభుత్వం సబ్సీడీలను ఎత్తివేసే కుట్రలను మానుకోవాలని హెచ్చరించారు. బంగారు తెలంగాణ అంటూ వూదరగొడుతున్న కేసీఆర్ ఆకలిచావుల తెలంగాణగా మార్చేందుకు పూనుకున్నట్లుందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయం వెనక్కితీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాళ్లు షేక్ మెహరున్నీసాబేగం, పి. ప్రభావతి, కె. అమరావతి, పత్తిపాక నాగసులోచన, పిన్నింటి రమ్య, భాగం అజిత, కె సరస్వతి, నాగమణి, బి. అరుణ, షేక్ బీబీ, బి.పద్మ, షేక్ ఫరీదా, శ్రీవాణి, మంగా, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# భూరికార్డుల సవరణను త్వరగా పూర్తిచేయాలి: కలెక్టర్



ఖమ్మం : భూరికార్డుల సవరణను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ లోకేశ్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఖమ్మం గ్రామీణ మండల తహసీల్దారు కార్యాలయానికి వచ్చి కలెక్టర్ రికార్డుల సవరణను, భూరికార్డుల సవరణ సాఫ్ట్‌వేర్‌ను పరిశీలించారు. రికార్డుల సవరణ, సవరణ చేసిన వాటిని అంతర్జాలంలో నమోదు చేసే క్రమంలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు. సవరణ చేసిన భూ వివరాలను వెంటనే అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు. భూ రికార్డుల సవరణ మొత్తం పూర్తయిన తరువాత క్షేత్రస్థాయిలో భూసర్వేలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ అధికారులు భూరికార్డుల సవరణను త్వరగా పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. అనంతరం రికార్డులో సవరణ చేసిన వాటి వివరాలను అంతర్జాలంలో నమోదు చేసే ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు నరసింహారావు, తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# తెరాస ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



తుర్కపల్లి : ప్రజా సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని సంక్షోభంలో పడేస్తున్న తెరాస ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూడిద బిక్షమయ్యగౌడ్ తెలిపారు. తుర్కపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీరు, తాగునీరు అందించే విషయంలో సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ప్రాజెక్టులు, జలాశయాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుకోవటమే తప్పా నిజంగా రైతాంగానికి, నిర్వాసితులకు మేలు చేయాలనే ఆలోచన ముఖ్యమంత్రికి లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డమీది సత్యనారాయణగౌడ్, శంకర్‌నాయక్, రాజయ్య, చంద్రయ్య, బద్దునాయక్, హన్మంతరెడ్డి, బిచ్చునాయక్, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## రానున్న రోజులు తెదేపావే : రాములు

పెబ్బేరు : తెదేపాకు తిరిగి మంచి రోజులు రానున్నాయని, వచ్చే సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జిల్లా అధ్యక్షుడు రాములు అన్నారు. పెబ్బేరు జూరాల అతిథిగృహంలో పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాలకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తల సమావేశం పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల అధ్యక్షులు కర్రెస్వామి, మాధవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఎన్ని పార్టీలు వచ్చినా తెదేపా క్యాడర్ చెక్కుచెదరలేదన్నారు. జిల్లాలో రావుల చంద్రశేఖర్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ పునాదులు గట్టిగా ఉన్నాయన్నారు. తెరాస పాలనతో ప్రజలు విసిగిపోయారని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు దూరమయ్యాయని ఆయన విమర్శించారు. వనపర్తిలో రావుల హయాంలో చేసిన అభివృద్ధే తప్ప తెరాస నేతలు చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో నాయకులు సితార వెంకటేశ్వర్లు, నాతమయ్య, తిరుమల్, రమేష్, సురేష్‌బాబు, వీరస్వామి, నర్శింహ పాల్గొన్నారు.

# గృహహింస చట్టంపై అవగాహన కల్పించాలి

భువనగిరి : తమపై జరుగుతున్న దౌర్జన్యాలను గృహహింస చట్టం ద్వారా ధైర్యంగా ఎదుర్కో వాలని కలెక్టర్ అనితారామచంద్రన్ మహిళలకు పిలుపునిచ్చారు. గృహహింస చట్టంపై పట్టణంలో షార్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు అక్షరాస్యులై చట్టాలపై అవగాహన కలిగి ఉంటే తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు. ఇళ్లలో హింసకు గురవు తున్న మహిళలు అణిగిమణిగి ఉండాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అందించిన గృహ హింస చట్టాన్ని వజ్రాయుధంగా వాడుకోవాలని సూచించారు. ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించే హక్కు ఎవరికీ లేదని ఆమె స్పష్టం చేశారు. మహిళలకు జిల్లా పాలన, పోలీసు యంత్రాంగం, న్యాయస్థానం ఎల్లవేళలా అండగా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కో వాలే తప్ప బలవన్మరణాలకు పాల్పడవద్దని సూచించారు. కౌన్సెలింగ్ ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కుమారులు పట్టించుకోకుంటే సంబంధిత ఆర్డీవో పరిధిలో వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటా రన్నారు. నల్గొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి ఆర్.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గృహహింస చట్టం ప్రాధాన్యాన్ని వివరించారు. గృహహింస చట్టంపై మహిళలు పూర్తి అవగాహన కల్గిఉండాలన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే మహిళలు తమకు ఎదుర య్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనవచ్చ న్నారు. అవగాహన కార్యక్రమంలో పుర అధ్యక్షురాలు సుర్వి లావణ్య, షార్ప్ సంస్థ గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీల, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి శారద, భట్టు రామచంద్రయ్య, బర్రె సుదర్శన్, కల్పన పాల్గొన్నారు.

# రూ.5 నుంచి 16 వేల దాకా వేతన పెరుగుదల: శేషయ్య

కొత్తగూడెం : దిల్లీలో ఈ నెల 10న జరిగిన జేబీసీసీఐ సమావేశంలో జరిగిన ఒప్పందం ద్వారా ఉద్యోగుల వేతనాలు రూ.5,322 నుంచి రూ.16వేల దాకా పెరగనున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి డి.శేషయ్య తెలిపారు. రుద్రంపూర్ కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంటు వద్ద ఏర్పాటైన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీతాలతో పాటు ఇతర అలవెన్సులు కూడా గడిచిన వేతన ఒప్పందం కన్నా మంచి పెరుగుదలను సాధించి నట్లు తెలిపారు. ప్రత్యేక కమిటీతో తగిన అధ్యయనం చేసేదాకా ప్రస్తుతం ఉన్న వారసత్వ ఉద్యోగాల పద్ధతే కొనసాగేవిధంగా ఒప్పందం చేసుకొన్నట్లు తెలిపారు. పింఛన్ కొనసాగించేం దుకు కార్మికులు 7శాతం, యాజమాన్యం 7శాతం ఈ నెల 1నుంచి జమచేయడం ద్వారా కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఇప్పుడున్న గ్రాట్యుటీ రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచుతూ రానున్న పార్లమెంటు సమావేశాల్లో సవరణ చేసిన అనంతరం నోటిఫికేషన్ ప్రకారం బొగ్గుగని కార్మికులకు వర్తింపజేస్తారని అన్నారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు

భువనగిరి : పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి నవంబర్ 1వరకు జరిగే అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల హాకీ పోటీలను భువనగిరి పట్టణంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం క్రీడా ఏర్పాట్లను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జడల అమరేందర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీరాములు పరిశీలించారు. భువనగిరి పట్టణంలో రాష్ట్ర స్థాయి హాకీ క్రీడలు 25 సంవత్సరాల అనంతరం జరుగుతుండటంతో విజయవంతం చేయడానికి నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తు న్నారు. రెండు క్రీడా మైదానాలను సిద్ధం చేశారు. ఒక మైదానం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మరోటి ఇండియామిషన్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకుడు ఖాద్రీ, పీఈటీలు నాతి కృష్ణమూర్తి, నాతి మల్లేషం, సోలిపురం వెంకట్‌రెడ్డి, నాయకులు కొల్పుల కమాలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పాసు పుస్తకాలతో అయిదెకరాల అసైన్డ్ భూమి స్వాహా



గద్వాల : నకిలీ పాసు పుస్తకాల వ్యవహారంలో పోలీసులు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వపరాలను డీఎస్పీ బాలకోటి సాయంత్రం విలేకరులకు వెల్లడించారు. కేటీదొడ్డి గ్రామానికి చెందిన శేషాద్రి అయిదేళ్ల కిందట నకిలీ పాసుపుస్తకాలతో గ్రామంలోని అయిదెకరాల అసైన్డ్ భూమిని గద్వాలకు చెందిన మహబూబ, దౌలత్‌బీ, అమీన్‌సాబ్ పేరిట మార్పించాడు. గట్టు మండల రెవెన్యూ అధికారుల సహకారంతో ఆన్‌లైన్‌లోనూ ఆ భూమి ముగ్గురి పేరిట ఉన్నట్లు నమోదు చేయించాడు. ఈ భూమిని చూపించి మహబూబ్ గట్టు ఎస్‌బీఐలో విడతల వారీగా రూ. 3.60 లక్షల పంటరుణాన్ని తీసుకున్నాడు. శేషాద్రి ఇలా అసైన్డ్ భూములను ఎమందికి కట్టబెట్టారో తెలుసుకునేందుకు వీలుగా కేటీదొడ్డిలో పొలాల వివరాల జాబితాలను కూడా తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇంకా ఇలాంటివి ఉన్నవేమో అన్న కోణంలో విచారణ జరుపుతున్నామని చెప్పారు. సమావేశంలో గద్వాల, కేటీదొడ్డి ఎస్సైలు శ్రీనివాస్, భాగ్యలక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

# ముస్లింలకు వరాలు పట్ల హర్షం

ఖమ్మం : మంత్రి మండలి సమావేశంలో ప్రకటించటం ఎంతో సంతోషకరమని ముస్లిం నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ షేక్.సిద్ధాసాహెబ్ అన్నారు.

ఖమ్మంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకు గ్యారంటీ లేకుండా రూ.2.75లక్షలు మంజూరు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మైనార్టీల అభివృద్ధికి మరిన్ని పథకాలు అమలు చేయాలని కోరారు. ఈసమావేశంలో రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు ఎస్‌కె.షకీనా, జిల్లా అధ్యక్షుడు మదార్, జిల్లా నాయకులు జాన్‌సైదా, యాకూబ్‌బేగ్, రంజాన్, రజియా సుల్తానా, హుస్సేన్‌బీ పాల్గొన్నారు.

# పత్తి రైతులను ఆదుకోవడంలో విఫలం



భువనగిరి : పత్తి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మంగ నర్సింహులు ఆరోపించారు. పట్టణంలోని సుందరయ్య భవన్ లో ఏర్పాటు చేసిన సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పత్తి పంట వస్తున్నప్పటికి నేటికీ సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. దీంతో రైతులు తక్కువ ధరకు దళారులకు పత్తిని విక్రయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటా పత్తి ఉత్పత్తికి రూ.4959 వ్యయం అవుతుండగా ప్రభుత్వం మద్దతు ధరను రూ.4320 నిర్ణయించడం ఎంత వరకు సమంజసమన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. నాణ్యతా ప్రమాణాల సాకు చూపుతూ ధరను తగ్గించవద్దని అన్నారు. రైతులకు మద్దతు ధరగా రూ.7725 చెల్లించాలని డిమాండ్ చేశారు.. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న వరంగల్ కాటన్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తా మన్నారు. వరి ధాన్యానికి రూ.2500 మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చింతల భూపాల్‌రెడ్డి, గునుగుంట్ల శ్రీనివాస్, ర్యాకల శ్రీశైలం, శ్రీధర్‌రెడ్డి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

